క్లుప్తంగా

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన కండక్టర్‌కు సత్కారం



కండక్టర్ బాబును సత్కరిస్తున్న డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు

గోపాలపట్నం: సింహాచలం డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న కె.ఆర్. బాబు అథ్లెటిక్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ నెల 16న కోల్‌కతాలో నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో బాబు మూడో స్థానం దక్కించుకుని బ్రాంజ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా సింహాచలం డిపోలో ఆయన్ను గురువారం డిపో మేనేజర్ కె. రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఎల్. సాయి తులసి, కేజీవీ కొండలరావు సత్కరించారు. సహ ఉద్యోగులు, సూపర్ వైజర్లు అభినందించారు.

పందుల దాడిలో లేగదూడకు గాయాలు



పందుల దాడిలో తీవ్రంగా గాయపడిన లేగ దూడ

పరవాడ: మంత్రిపాలెంలో ఊర పందుల బీభత్సంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాలనీల్లో విచ్చల విడిగా సంచరిస్తూ దాడులు చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో ఊర పందుల దాడిలో లేగ దూడలు ప్రాణాలు కోల్పోగా మళ్లీ గురువారం కళ్లంలో కట్టిన ఓ లేగదూడపై పందులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయని వాపోయారు. పందుల కారణంగా పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచ్చల విడిగా మూగ జీవాలపై దాడులకు పాల్పడుతున్న పందులను నివారించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకెట్ల అందజేత



రేడియం జాకెట్లు అందజేస్తున్న సీఐ అశోక్‌కుమార్, దాత నరసింహమూర్తి

సింహాచలం: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 40 మంది కానిస్టేబుళ్లకు చినముషిడివాడకు చెందిన నరసింహమూర్తి అనే దాత సహకారంతో కొనుగోలు చేసిన రేడియం జాకెట్లను వెస్ట్ జోన్ సీఐ అశోక్‌కుమార్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

సురేష్ రాజ్‌కు అభినందన



పాలిశెట్టి సురేష్ రాజ్‌ను అభినందిస్తున్న కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన మండలంలోని లగిశెట్టిపాలేనికి చెందిన పాలిశెట్టి సురేష్‌రాజ్‌ను పలువురు అభినందించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీతో పాటు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం సత్కరించి అభినందనలు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

సింహాచలం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవి విజయానికి పార్టీ శ్రేణులంతా కలిసి పనిచేయాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. పెందుర్తి మండలం సుజాతనగర్‌లోని కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన సమావేశంలో అభ్యర్థి చిరంజీవిని పరిచయం చేశారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేసవిలో హాయిగా..

చురుగ్గా విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు



పరవాడ: వేసవిలో కూడా నాణ్యమైన విద్యుత్ అందించడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. విద్యుత్ వినియోగం పెరగనున్న దృష్ట్యా అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు నిర్వహణ సామర్థ్యంపై దృష్టిసారించారు. దీని కోసం విడతల వారీగా పనులు చేపడుతున్నారు. ఆయా ఫీడర్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు అవసరమైన చోట నూతన పరికరాలు అమర్చుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, లైన్లలో ఉన్న చిన్నచిన్న మరమ్మతులు పూర్తి చేస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలో పి.బోనంగి గ్రామంలో గురువారం నిర్వహణ పనులు చేపట్టారు. ఎన్టీపీసీ ఫ్లైయాష్ కారణంగా వైర్లు తుప్పు పట్టి తరచూ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ , జెడ్పీటీసీ పి.ఎస్.రాజు సమస్యను ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సిబ్బంది తుప్పు పట్టిన విద్యుత్ వైర్లు మార్చి కొత్తవి ఏర్పాటు చేశారు. విద్యుత్ స్తంభాలపై దెబ్బ తిన్న కేశారాలను తొలగించి నూతన కేశారాలు, పిన్నులు ఏర్పాటు చేశారు. విద్యుత్ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేసిన జెడ్పీటీసీ పి.ఎస్.రాజుకు సర్పంచ్ కల్పన రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



పి.బోనంగిలో విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నార సింహుడికి వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో అప్పన్న ఉత్సవమూర్తులు



స్వామికి కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ పుష్పార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్య కల్యాణం : వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మంపడంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

గడువులోగా పనులు పూర్తి



సమావేశానికి హాజరైన అధికారులు, సభ్యులు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి

ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

పరవాడ: మండలంలోని వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్ అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో 966 జగనన్న గృహాలు మంజూరు కాగా వాటిలో 378 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎం.ఎస్.ఎస్.ఎన్ రెడ్డి చెప్పారు. జల్ జీవన్ మిషన్ ద్వారా మండలంలో 20 గ్రామాల్లో ఇంటింటి కుళాయిల నిర్మాణ పనులు పూర్తయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ వివరించారు. మరో 17 గ్రామాల్లో ప్రగతిలో ఉండగా మరో ఏడు గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

- మండలంలో మూడో విడత రైతు భరోసా అందని 129 మంది లబ్ధిదారులకు ఈ నెల 27న ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి సీహెచ్.చంద్రావతి చెప్పారు. మండల సమావేశాలకు గైర్హాజరవుతున్న రెవెన్యూ అధికారుల వివరణ కోరాలని ఎంపీడీవోను ఎంపీపీ ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో వి.హేమసుందర్రావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, పైల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు పెద్దపీట
- చంద్రబాబు హయాంలో వెనుక బడిన వర్గాలకు మొండి చేయి
- పవన్‌కు అజెండా లేదు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతం రాజు సుధాకర్‌కు పట్టం కట్టండి
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సింహాచలం: సామాజిక న్యాయం మాటల్లో కాకుండా.. చేతల్లో నిరూపించిన వ్యక్తిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. పెందుర్తి మండలం రాంపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకేసారి రెండు లక్షల ఉద్యోగాలు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని పదవుల్లో సామాజిక న్యాయం చేశారన్నారు. బీసీల్లోని 56 సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అంబేద్కర్, జ్యోతిరావుపూలే భావజాలాలు దేశంలో జగన్‌మోహన్‌రెడ్డికే ఉన్నాయన్నారు. 14 మంది ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించారన్నారు. ఇంత పెద్ద ఎత్తున సామాజిక న్యాయం ఏ రాష్ట్రంలోనైనా జరిగిందా అని ఆయా సామాజిక వర్గాలతో పాటు మేధావులు కూడా ఆలోచన చేయాలన్నారు. 40 ఏళ్ల సీనియారిటీ అని చెప్పుకునే చంద్రబాబు ఎప్పుడైనా వెనుకబడినవర్గాలకు ఇంత ప్రాధాన్యం ఇచ్చారా అని ప్రశ్నించారు.

వాటి గ్రాఫ్ డౌన్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిస్తే పవన్‌కల్యాణ్ గ్రాఫ్ ఇంకా పడిపోతుందన్నారు. అసలు పవన్‌కల్యాణ్‌కు ఒక జెండా , అజెండా లేదని విమర్శించారు. ఎప్పుడూ ఒకరికి ఊతం ఇచ్చే పరిస్థితి ఆయనదని ఎద్దేవా చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఒంటరిగానే పోటీచేసి అద్భుత విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

త్వరలోనే విశాఖ నుంచి పరిపాలన

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో విశాఖ షిఫ్ట్ అవుతారని.. ఇక్కడ నుంచే పాలన చేయడానికి తగిన వనరులు ఉన్నాయన్నారు. టీడీపీ హయాంలో సుగర్ ఫ్యాక్టరీల వ్యవస్థనే సర్వనాశనం చేసేశారన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో చోడవరం సుగర్ ఫ్యాక్టరీని నిలబెట్టగలిగామన్నారు. రూ. 170 కోట్లు అప్పులబారిన పడిన ఫ్యాక్టరీకి రూ.80 కోట్లు గ్రాంట్‌ల రూపంలో తీసుకొచ్చి నిలబెట్టడం జరిగిందన్నారు.

ఇవి కుల ప్రాతిపదిక ఎన్నికలు కావు

ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలు కులప్రాతిపదికన జరగడం లేదని, పట్టభద్రుల ప్రాతిపదికన జరుగుతున్నాయని ధర్మశ్రీ అన్నారు. అన్ని సామాజిక వర్గాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కే మద్దతు ఇస్తున్నాయన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతం రాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అధికారుల తీరుపై గరం గరం

మండల సర్వసభ్య సమావేశంలో గళం విప్పిన ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: అధికారులు తమ పరిధిలోని సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వహించడం సరికాదని ఎంపీపీ బోకం సూర్యకుమారి అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. అయా శాఖల పనితీరు, ప్రగతిని సమీక్షించారు. గ్రామాల్లో మండల స్థాయి అధికారులు పర్యటించినపుడు తమకు సమాచారం ఉండడం లేదని, పదేపదే సభలో సమస్యను లేవనెత్తినప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీపీతో పాటు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు మాట్లాడుతూ కొంత మంది మండల స్థాయి అధికారులు కావాలనే సభకు గైర్హాజరవుతున్నారన్నారు. దీంతో ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించినపుడు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించడం వల్ల కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయన్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సభ్యులంతా అసహనం వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కార్యకలాపాలు సక్రమంగా జరగడం లేదని,జిల్లా రిజిస్ట్రార్‌కు లెటర్ రాయాలని ఎంపీడీవోకు ఎంపీపీ ఆదేశించారు.పైడివాడ అగ్రహారంలో లేఅవుట్‌లో రైతులకు ఇచ్చిన ప్లాట్‌లను అభివృద్ధి చేయాలని ఎంపీటీసీ రాజు సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ మాట్లాడుతూ రెండు, మూడు నెలల్లో రైతులకు అందజేసిన ప్లాట్‌లలో వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఎల్లుప్పిలో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారని ఉప సర్పంచ్ ఉగ్గిన గంగునాయుడు ప్రస్తావించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, ఎంపీడీవో రమేష్ నాయుడు, ఏవో ఎస్. బాబూరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విరోతి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సింహాచలం: పాత పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు డీఆర్‌సీ మాల్ అధినేత దాడి రమణ చిట్టి సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి ఉమామేశ్వరరావు గురువారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. 500 మార్కులు దాటిన విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ప్రత్యేక బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూర్తి, 96వవార్డు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గణేష్, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ దాడి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు,వైద్య సిబ్బంది



మాక్ డ్రిల్‌లో భాగంగా కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్కాపురం: కెమికల్ పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై కార్మికులకు అవగాహన,మాక్ డ్రిల్ నిర్వహించారు. కేంద్ర,రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థల ఆధ్వర్యంలో స్థానిక ఈస్ట్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో విపత్తులను ఎలా ఎదుర్కోవాలి, ఆపదలో ఉన్న వారిని ఎలా కాపాడాలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి వైద్యం అందించాలో వివరించారు. మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌డీఎం ప్రతినిధి పి.ఎస్.సర్కార్,రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రసాయన పరిశ్రమల్లో తలెత్తే ప్రమాదాల నుంచి తప్పుకునే విధానాలు, కార్మికులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ములగాడ తహసీల్దార్ డి.వీరభద్రరావు, కోరమాండల్ అధికారి శ్రీనివాసరావు,శ్రీకాంత్ పాల్గొన్నారు.

పౌరులు చైతన్యవంతం కావాలి

మల్కాపురం: ప్రజలు చైతన్యవంతులైనప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందని స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. కళాశాల ఆవరణలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'భారత రాజకీయాలు – పౌరుల చైతన్యం' అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రజలు విద్యావంతులు, చైతన్యవంతులు అయ్యారన్నారు. ఇది మంచి పరిణామం అన్నారు. రాజనీతి శాస్త్ర విభాగ సీనియర్ అధ్యాపకురాలు వై.అనసూయాదేవి మాట్లాడుతూ పౌరులు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పలు అంశాలపై క్విజ్ నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు అందించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: సాంస్కృతిక రాజధానిగా రూపుదాల్చిన విశాఖలో దివికేగిన సినీ దిగ్గజాల స్మారకార్థం సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని గీతం విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో కళాతపస్వి కె.విశ్వనాథ్, నేపథ్యగాయనీ వాణీ జయరామ్‌ల స్మారకార్థం నిర్వహించిన సినీ సంగీత విభావరికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు భాషా విలువలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు కె.విశ్వనాథ్ అని.. జాతీయ స్థాయి గుర్తింపు పొందిన వాణీ జయరామ్‌లు సినీ ప్రపంచానికి దూరం కావడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా రమేష్ పట్నాయక్, శ్రీవిద్య పాడిన అందెల రవమిది, శంబర జోగారావు శైలజ పాడిన రేపల్లియ యెద ఝల్లున పొంగిన రవళి, వీకే రాజు శృతి పాడిన రాగాల పల్లకిలో, రాజేంద్రప్రసాద్, కల్యాణి పాడిన ఒక పూల బాణం పాటలు ప్రేక్షకులను అలరించాయి. పాడుతా తీయగా విన్నర్ సార్థక్, లక్ష్మీశైలజ, పి.ఎల్.నాయుడు, కోసూరు రాజు, దీప్తి పలు హిట్‌సాంగ్స్ పాడి వీనుల విందుచేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, వైభవ్ జ్యూలర్స్ అధినేత్రి గ్రంధి మల్లిక, వ్యాపారవేత్త పువ్వాడ శోభన్ ప్రకాష్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగవంతం

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ రాజాబాబు

గోపాలపట్నం: జీ–20 సదస్సు మార్చి నెలలో నిర్వహించనున్న నేపథ్యంలో జాతీయ రహదారిలో సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. రెండో రోజు గురువారం ఆయన వంటిల్లు వద్ద నుంచి మారియట్ హోటల్ వరకు కాలినడకన పర్యటించారు. రహదారికి ఇరువైపులా ఉన్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. రహదారిలో గ్రీన్ బెల్టును శుభ్రపరచాలని పారిశుధ్య అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ఏడీసీ సన్యాసిరావు, సీసీపీ సురేష్, డీడీహెచ్ దామోదర్, ఎస్ఈలు రామ్మోహన్, వేణుగోపాలరావు, డీసీపీ రత్నకుమార్, జోన్–5 జెడ్సీ కష్ణ, జోన్–8 జెడ్సీ మల్లయ్యనాయుడు, ఏసీపీ రమణమూర్తి, ఈఈ సంతోషికుమారి, జోన్–5 ఏఎంహెచ్‌వో రాజేష్ పాల్గొన్నారు.

ప్రయాణికుల ముసుగులో నగలు చోరీ

గోపాలపట్నం: ప్రయాణికుల ముసుగులో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ నుంచి బంగారం చోరీ చేసిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి బాజీ జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలు షేక్ హసెన్‌బీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం సంతోష్‌నగర్‌లో నివాసముంటున్న షేక్ హసెన్‌బీ బుధవారం సాయంత్రం గోపాలపట్నం సోనో విజన్ వద్ద ఆటో ఎక్కింది. కొద్ది దూరం వెళ్లాక ముగ్గురు మహిళలు ఆటో ఎక్కారు. ఎన్ఏడీ జంక్షన్ వద్ద ఆటో దిగి చూసుకునే సరికి హ్యాండ్ బ్యాగ్ తెరిచి ఉంది. లోపల ఉంచిన బంగారు ఆభరణాల స్టీల్ బాక్స్ కనిపించలేదు. వెంటనే ఆటో కోసం చూడగా వేగంగా మర్రిపాలెం వైపు వెళ్లిపోయింది. తనను మధ్యపెట్టి మధ్యలో ఎక్కిన ముగ్గురు మహిళలే చోరీ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తోంది. బాక్స్‌లో 2 తులాల చైన్, జత చెవి దుద్దులు కలిపి మొత్తం 4 తులాలు ఉంటుందని తెలిపింది. ఎస్ఐ కాంతారావు దర్యాప్తు చేపట్టారు.

ఉక్కు సంకల్పంతో ప్లాంట్ పరిరక్షణ



శిబిరంలో పాల్గొన్న స్టీల్ ఎస్ఎంఎస్-2 ఉద్యోగులు

కూర్మన్నపాలెం: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉక్కు సంకల్పంతో ఉద్యోగులు పోరాటాలు చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 742వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఎస్ఎంఎస్–2 డిపార్టుమెంట్‌కు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఎంతోమంది ప్రాణాలను, భూములను త్యాగం చేసి సాధించుకున్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేస్తామనడం సరికాదన్నారు. దీని కోసం ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

యువతపై ప్రకృతి పరిరక్షణ బాధ్యత

గాజువాక: ప్రకృతిలో ప్రధానమైన భూమి, గాలి, నీరును కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని జీవీఎంసీ గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. దీనికోసం ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పర్యావరణాన్ని ఎంతో ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటినుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను తడి, పొడి, హానికారిక వ్యర్థాలుగా విభజించి ఇంటికి వచ్చే స్వచ్ఛ సర్వేక్షణ్ వాహనం సిబ్బందికి అందజేయాలని కోరారు. ఇలా చేయకపోతే వివిధ వ్యాధులకు గురయ్యే అవకాశం కూడా ఉందన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న షిప్‌యార్డ్ ఉద్యోగులు

సింధియా: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని షిప్‌యార్డ్ అధికారులు పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా షిప్‌యార్డ్ కాలనీలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ సముదాయంలో గురువారం యోగా శిబిరం నిర్వహించారు. యోగా వల్ల ఉపయోగాలను తెలియజేస్తూ అధికారులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు.